సాక్షి
పల్నాడు
శనివారం । 29 । ఏప్రిల్ । 2023



ధ్యానబుద్ధను సందర్శించిన మంత్రి సీదిరి

అమరావతి: ధ్యానబుద్ధ ప్రాజెక్టును పశుగణాభి వృద్ధిశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఆయన వెంట ఓఎస్డీ యుగంధర్ ఉన్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,500, మోడల్ ధర రూ.2,200 వరకు పలికింది.

కరోనా - జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్(మాచర్ల): నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఇది 153.5035 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 805.20 అడుగుల వద్ద ఉంది. ఇది 31.6510 టీఎంసీలకు సమానం.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పప్పుల విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ఉత్తర్వులు జారీ చేశారని ఇన్‌చార్జి ఎంపీడీవో సాంబశివరావు శుక్రవారం తెలిపారు. గతంలో గామాలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విజయ్‌కుమార్ విధులు నిర్వహించిన సమయంలో వచ్చిన ఆరోపణలపై ఈవోపీఆర్డీ కొల్లి రాధామాధవిని విచారణ అధికారిగా నియమించారు. సుదీర్ఘమైన విచారణ చేపట్టిన ఈవోపీఆర్డీ రూ.25.22 లక్షల నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఓ సిమెంట్ ఫ్యాక్టరీ పంచాయతీకి కట్టాల్సి న పన్నులను చెక్‌రూపంలో ఇస్తే వేరే అకౌంట్ ద్వారా చెక్‌లను మార్చి వ్యక్తిగతంగా నగదును ఉపయోగించుకున్నట్లు ఈవోపీఆర్డీ విచారణ లో గుర్తించారు. అదే విధంగా గామాలపాడు గ్రామ పంచాయతీ నుంచి శ్రీనగర్ గ్రామ పంచాయతీకి బదిలీ అయిన తరువాత గామాలపాడు గ్రామ పంచాయతీ రికార్డులను కూడా అప్పగించకుండా ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామకోటేశ్వరరావును కూడా ఇబ్బంది పెట్టినట్లుగా విచారణలో వెలు గు చూసింది. పంచాయతీ కార్యదర్శిగా విజయ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపిన ఈవోపీఆర్డీ నివేదిక ఆధారంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

కొత్త 'పల్లెసీమలు'

- జోరందుకున్న గృహ నిర్మాణాలు
- థర్డ్ ఆప్షన్‌తో సత్ఫలితాలు
- మొత్తం వివిధ దశల్లో 4,377 గృహాల నిర్మాణం
- వెలుస్తున్న కొత్త ఊళ్లు



థర్డ్ ఆప్షన్ జగనన్న ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విడదల రజిని (ఫైల్)

చిలకలూరిపేట: కొత్త ఊళ్లు వెలుస్తున్నాయి. పేద వారి సొంతింటి కల సాకారం అవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు ఊపందుకున్నాయి. పట్టాలు పంపిణీ చేసిన తొలినాళ్లలో సకాలంలో బిల్లులు మంజూరు అవుతాయో లేదోనని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో అధికారులు బేస్‌మెంట్ మేళా వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. అయితే పనులు ప్రారంభించిన లబ్ధిదారుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు బిల్లులు జమ అవుతూ ఉండటంతో ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.. దీనికి తోడు ప్రభుత్వం థర్డ్ ఆప్షన్ కింద కాంట్రాక్టర్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేయించి ఇచ్చేలా కల్పించిన అవకాశం సత్ఫలితాలు ఇస్తోంది. థర్డ్ ఆప్షన్ ద్వారా ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదారుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో నిర్వహింపచేశారు. దీనికి తోడు గత ఏడాది సెప్టెంబర్‌లో జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేసేలా మంత్రి విడదల రజిని 1367 మంది లబ్ధిదారులతో ఒప్పందం చేయించి అదే నెల తొమ్మిదో తేదీన సామూహిక శంకుస్థాపనలు నిర్వహింప చేశారు.

భారీ స్థాయిలో ....

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో చిలకలూరిపేట నియోజకవర్గంలో భారీస్థాయిగా 13,244 మందికి జగనన్న కాలనీల్లో పట్టాలు మంజూరు చేశారు. వీటి కోసం ప్రభుత్వం రూ.220 కోట్లు వెచ్చించి 332.46 ఎకరాల భూమి కొనుగోలు చేసింది. ఇందులో ఫస్ట్‌ఫేజ్ కింద చిలకలూరిపేట పట్టణంలోని పసుమర్రు లేఅవుట్‌లో 3,022 మంది లబ్ధిదారులు గృహాలు కట్టుకొనేందుకు అనుమతులు మంజూరు చేసింది. యడ్లపాడు మండలంలో ఫస్ట్ పేజ్ కింద 1355 గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది.

థర్డ్ ఆప్షన్ ద్వారా...

థర్డ్ ఆప్షన్ ద్వారా ఒక్క పసుమర్రు లేవెట్‌లోనే 1367 గృహాలు నిర్మిస్తున్నారు. ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం రూ.1.80లక్షలు ఉచితంగా అందజేస్తుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 35 వేలు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహాయం, రుణ సౌకర్యం కలిపి రూ. 2.15 లక్షల్లోనే గృహాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధం చేస్తుంది.



పసుమర్రు లేఅవుట్‌లో థర్డ్ ఆప్షన్ ద్వారా నిర్మాణం పూర్తికావచ్చిన ఇళ్లు

పక్షం రోజుల్లో ఇల్లు స్వాధీనం చేస్తామన్నారు



థర్డ్ ఆప్షన్ కింద ఇంటి నిర్మాణానికి అంగీకారం చేసుకున్నా. దీంతో నాకు జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా ఇంటి నిర్మాణం జరుగుతోంది. మే రెండో వారంలో ఇంటిని స్వాధీనం చేస్తామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే వచ్చి ఇల్లు స్వాధీనం చేసుకోమని ఇప్పటికే సమాచారం ఇచ్చారు.

– షేక్ షమీమ్, లబ్ధిదారు

నిర్మాణం చేసి ఇస్తాం



స్వయంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి ప్రభుత్వం దశలవారీగా బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. థర్డ్ ఆప్షన్ ద్వారా ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు ముందుకు వస్తే ఇళ్ల నిర్మాణాలు చేయించి ఇస్తాం. దీని కోసం లబ్ధిదారులు అంగీకార పత్రం అందజేయాల్సి ఉంటుంది.

–ఎస్ వెంకటరావు, డీఈఈ, హౌసింగ్

జగనన్నా.. ధన్యవాదాలన్నా...



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పీఆర్కే తనయుడు గౌతంరెడ్డి, పీఆర్కే,లావు

ముఖ్యమంత్రిని కలసిన ఎంపీ కృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి

మాచర్ల: వరికపూడిసెలకు అనుమతులు తెప్పించి త్వరలో ప్రాజెక్టును చేపట్టడానికి సిద్ధమైన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు స్వయంగా కలసి ధన్యవాదాలు తెలియచేశారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం జగన్‌ను పీఆర్కే, లావు కలిశారు. ఇచ్చిన మాట ప్రకారం లక్షలాది మంది మాచర్ల, వినుకొండ పల్నాడు ప్రాంత రైతులకు మేలుచేసే విధంగా వరికపూడిసెలకు ప్రాధాన్యం ఇవ్వడంపట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. పల్నాటివాసులంతా మీ నిర్ణయం పట్ల ఎంతో ఆనందపడుతున్నారన్నారు. త్వరలోనే సమయాన్ని కేటాయించి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపనకు విచ్చేసి రైతుల కృతజ్ఞతలను స్వీకరించాలని వారిరువురూ ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై సీఎం సానుకూలత వ్యక్తం చేసినట్లు పీఆర్కే, లావు వెల్లడించారు.

ప్రథమ స్థానంలో ఇళ్ల నిర్మాణం

సమీక్షలో అధికారులను ఆదేశించిన కలెక్టర్

నరసరావుపేట: రానున్న రోజులలో పల్నాడు జిల్లాను జగనన్న లేఔట్ కాలనీల్లోని ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. జీరోస్థాయి పురోగతిలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేడ్కర్ హాలులో గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో సంబంధితశాఖ అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా పురోగతిపై సంబంధిత టీంలతో కూలంకషంగా చర్చించి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన చోట లబ్ధిదారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్లలో విద్యుత్ అసౌకర్యం కలగకుండా అవసరమైన చోట వెంటనే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. అదేవిధంగా బోర్లు అవసరమైన చోట బోర్లు వేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండలాధికారులు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్ ఫార్మా కంపెనీలో పోలీసుల తనిఖీలు



గోళ్ళపాడులోని సేఫ్ ఫార్మా కంపెనీలో రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ సీఐ ఉమేష్

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడు గ్రామంలోని సేఫ్ ఫార్మా కంపెనీలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై కంపెనీలో నిషేధిత ట్రిమడాల్ బిళ్లలు తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ ఆర్.ఉమేష్ తెలిపారు. ట్రిమడాల్ బిళ్లల తయారీ కోసం అనుమతులు ఎవరెవరి దగ్గర పొందారో అనే అంశాలపై పత్రాలను, రికార్డులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు పంపామని పేర్కొన్నారు.

అన్ని అనుమతులతోనే తయారీ

సేఫ్ ఫార్మా కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతుల మేరకే ట్రిమడాల్ బిళ్లలు తయారు చేశామని, బెంగళూరుకు చెందిన ఫార్మా కంపెనీ ఇచ్చిన ఆర్డర్ మేరకు నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్ అనుమతులు పొందిన తర్వాతే బిళ్లలు తయారు చేసి అందించామని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా తయారు చేయలేదని, అమ్మకాలూ చేపట్టలేదని వెల్లడించారు. జాతీయ డ్రగ్ కంట్రోల్ సంస్థ నిబంధనల మేరకే మందులు తయారు చేస్తామని వివరించారు.

'జగనన్నకు చెబుదాం'ను జయప్రదం చేద్దాం

అధికారులను ఆదేశించిన కలెక్టర్ శివశంకర్



సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం మే తొమ్మిదిన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం హాజరైన జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంపై సీఎంఓ స్థాయి నుంచి పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ప్రత్యేకంగా నియమించిన సీనియర్ లెవెల్ ఐఏఎస్ అధికారులు నెలకు రెండుసార్లు జిల్లాల్లో పర్యటించి అమలు తీరును పరిశీలిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచింది సీఎం జగనే

రెడ్‌క్రాస్ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



పారిశుద్ధ్య కార్మికులకు రెడ్‌క్రాస్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులకు రూ.12వేల నుంచి రూ.21 వేలకు జీతాలు పెంచినది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుర్తుచేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా 325 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.500 విలువచేసే హైజనిక్ కిట్లను ఉచితంగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రోజూ కార్మికులు కష్టపడితేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్ జీతాలు పెంచారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఆ సమయంలో వారికి వివిధ సేవాసంస్థలు, మున్సిపల్ కార్యాలయం ద్వారా నిత్యావసరాలు అందజేసి ఆదుకున్నామన్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత రూ.4.5కోట్లతో కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్‌ను రెడ్‌క్రాస్ ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లేట్‌లెట్స్ కావాల్సిన వారికి ఈ సెంటర్ ద్వారా లభ్యమవుతాయని వివరించారు. రెడ్‌క్రాస్ సంస్థలో మెంబర్లుగా చేరితే గుర్తింపు కార్డు ఇస్తారని, ఎప్పుడైనా రక్తం కావాల్సివస్తే ఆ మెంబర్‌కు మొదట ఇచ్చిన తర్వాతనే మిగతా వారికి అందజేస్తారన్నారు. అగ్ని ప్రమాదాలు లాంటి విపత్కర దుర్ఘటనలు ఎదురైన సమయంలో రెడ్‌క్రాస్ సంస్థ బాధితులకు అండగా ఉంటుందని వివరించారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్‌కు దాతల సహకారం ఎంతో అవసరం ఉందని, విరాళాలు ఇచ్చిన వారికి పన్ను మినహాయింపు లభిస్తుందని వివరించారు. మున్సిపల్ ఉద్యోగులు అందరూ రెడ్‌క్రాసు మెంబర్లుగా చేరేందుకు మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకోవాలని కోరారు. రెడ్‌క్రాస్ సంస్థకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం చేపడతామని వెల్లడించారు. కార్యదర్శి కేవీఎస్ఎన్ శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచనల మేరకే కిట్లను అందజేస్తున్నామని పేర్కొన్నారు. పల్నాడు అభివృద్ధి అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ కిట్ల పంపిణీ ద్వారా ప్రతి ఒక్కరికీ సహాయం చేయాలనే రెడ్‌క్రాస్ దృక్పథం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, రెడ్‌క్రాస్ కోశాధికారి రాము, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచారకార్యదర్శి జి.ఉత్తమరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, హాలీవుడ్ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలకు పర్యావరణ అనుమతులపై మిశ్రమ స్పందన



ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

మార్టూరు: గ్రావెల్ తవ్వకాల కోసం ఓ సంస్థ దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 387/సీ11లో గ్రావెల్ తవ్వకాల కోసం ఐ ఫీచర్ లిమిటెడ్ అనే సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు సుమారు 70 మంది పాల్గొన్నారు. అధికారులు ప్రజల నుంచి చేతులెత్తి తమ అభిప్రాయం తెలపాలని కోరగా బొబ్బేపల్లి గ్రామానికి చెందిన మెజారిటీ వ్యక్తులు ప్రస్తుత సంస్థకు అనుమతులు ఇవ్వొద్దని, గతంలో ఇచ్చిన అనుమతులు కూడా రద్దు చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు మాత్రం అభివృద్ధి కోసం, రోడ్డు కోసం గ్రావెల్ అవసరమే కనుక పర్యావరణ ఇబ్బందులు రాకుంటే తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు. ఈ క్రమంలో జేసీ శ్రీధర్, బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని నివేదిక రూపంలో కాలుష్య నియంత్రణ మండలికి, మైనింగ్, ఇతర సంబంధిత శాఖలకు పంపిన అనంతరం వివరాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ శాఖ ఇంజినీర్ జి.నాగిరెడ్డి, తహసీల్దార్ బి.వెంకటరెడ్డి, సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐ బాషా, రెవెన్యూ సిబ్బంది, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

30న జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు

సత్తెనపల్లి: చైతన్య కళా స్రవంతి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 30న ఉదయం 10 గంటల నుంచి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సరస్వతి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు ట్రాక్ ఆధారంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కమతం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ పాటల పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి, షీల్డ్‌లు, ప్రత్యేక బహుమతులుగా రూ.500 పది మందికి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు చైతన్య కళా స్రవంతి ప్రధాన కార్యదర్శి గుండవరపు అమర్‌నాథ్ 9390132978 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

మార్టూరు: ప్రయాణికులను దారి కాచి కత్తులతో బెదిరించి చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను శుక్రవారం మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇటీవల స్థానిక జాతీయ రహదారిపై రాత్రి పూట సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రయాణికులను కొందరు వ్యక్తులు కత్తులు చూపి బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందినా పోలీసులు వాటిని గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్థానిక పోలీసు అధికారులు దీనికి సంబంధించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎందుకన్నా ఇలా..

అలకా.. అవమానమా..?!

- టీడీపీలో కన్నా లక్ష్మీనారాయణ పరిస్థితి దైన్యం
- ప్రచార రథం, బాబు వేదికలపై కనిపించని వైనం
- వరుసగా అవమానాలు
- రగిలిపోతున్న అనుచరులు



చంద్రబాబు పక్కన చేతులు కట్టుకుని నిలబడిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఐదుగురు ముఖ్యమంత్రులతో కలిసి పని చేసి, మంత్రి పదవులు నిర్వహించి సీనియర్ నాయకుడిగా పేరొందిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరిస్థితి ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో దయనీయంగా మారింది. టీడీపీలో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఎదిగిన నేతల మధ్య ఒక సాధారణ నాయకుడి స్థాయి కన్నా కిందకు దిగజారారని ఆయన అభిమానులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ పల్నాడు జిల్లా పెదకూరపాడు నుంచి సత్తెనపల్లి నియోజకవర్గానికి బయలుదేరిన ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు పర్యటన ప్రచార రథంలో కన్నాకు సముచిత స్థానం, గౌరవం లభించలేదు. సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్‌లో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమీక్ష– సమావేశాల్లోనూ వేదికపై కన్నా కనిపించలేదు. కావాలనే ఆయనను వేదికపైకి పిలవలేదని, చంద్రబాబూ పట్టించుకోవడం లేదని కన్నా వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే తనకు జరుగుతున్న అవమానాలపై కినుక వహించే బీసీ ఆత్మీయ సమావేశంలో కన్నా వేదిక ముందు కూర్చున్నారనే చర్చ కూడా సాగుతోంది. మొత్తమ్మీద చంద్రబాబు పర్యటనలో ఒక్క పెదకూరపాడు నియోజకవర్గంలో తప్ప మరెక్కడా చంద్రబాబునాయుడు పక్కన కన్నా కనిపించలేదు. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చక్రం తిప్పిన నాయకుడికి ఇదేమి ఖర్మ.. అంటూ నేతలు చర్చించుకోవడం గమనార్హం. ఈ విషయం సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లోనూ వైరల్‌గా మారడం గమనార్హం.

విజేత గుంటూరు జిల్లా ఎడ్లజత


- నాలుగుపళ్ల విభాగంలో సత్తాచాటిన వైనం
- ఉత్సాహంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన



ఎడ్ల బలప్రదర్శన పోటీ జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి : వీర్ల అంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం కూడా ఉత్సాహంగా సాగాయి. నాలుగు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షలాచౌదరి ఎడ్ల జత 5,977 అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం గనికపూడికి చెందిన కల్లూరి ప్రవీణ్‌కుమార్ సంయుక్త ఎడ్ల జత నిర్ణీత సమయంలో 5,949 అడుగుల దూరం బండను లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షలా చౌదరి ఎడ్లజత 5,298 అడుగుల దూరం బండను లాగి మూడవ స్థానంలో, కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లికి చెందిన జొన్నలగడ్డ దేవతరావు ఎడ్లజత 5,256 అడుగుల దూరం బండను లాగి నాలుగోస్థానంలో, బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన గౌతుకట్ల వీరాంజనేయ యాదవ్ ఎడ్లజత 5,250 అడుగుల దూరం బండనులాగి ఐదో స్థానంలో, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారానికి చెందిన బలగాని ఉదయ్ రేఖా యాదవ్ ఎడ్లజత 5,056 అడుగుల దూరం బండను లాగి ఆరో స్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. విజేతలకు వరుసగా దాతలు అంబటి నారాయణ, కూరాకుల నాగేశ్వరరావు, పసుపులేటి ఆదినారాయణ, నందేల రామిరెడ్డి, గాదె రామకృష్ణారెడ్డి, సంకురాత్రి బుల్లోడు, తిప్పా బ్రదర్స్, బిళ్లల వెంకటేశ్వర్లు నగదు, షీల్డ్స్ బహూకరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలీప్, ప్రశాంత్ తదితరులు పర్యవేక్షించారు.

జత పళ్ల విభాగంలో పల్నాడు ఎడ్ల సత్తా



జత పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు

మాచవరం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో మాచవరం గ్రామం కొత్తపాలెం గ్రామానికి చెందిన మన్నంపల్లి వెంకటరత్నం, శావల్యాపురం మండలం మతకమల్లి గ్రామానికి చెందిన ముండ్రు జీవప్రసాదుకు చెందిన సంయుక్త ఎడ్ల జత 3,750 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కల్లూరి ప్రవీణ్‌కుమార్ (గనికపూడి, ప్రత్తిపాడు మండలం), జంగా రామలింగయ్య యాదవ్ (దాచేపల్లి) సంయుక్త ఎడ్లజత 3,099.4 అడుగులు, మావనబోయిన పోతురాజు యాదవ్ (ఇక్కుర్తి, నర్సరావుపేట మండలం) ఎడ్లు 2,852.4 అడుగులు, లింగా అంజయ్య (గురజాల) ఎడ్లు 2,827.5 అడుగులు, యామర్తి వెంకటేశ్వర్లు (శ్రీరుక్మిణీపురం, మాచవరం మండలం) ఎడ్లు 2,288 అడుగులు, ముద్దన సుహాన్ (జగ్గాపురం, యడ్లపాడు మండలం), సంపటం తిరుపతయ్య నాయుడు (ఉయ్యందన,క్రోసూరు మండలం) సంయుక్త ఎడ్లజత 2,163.10 అడుగులు ఆరుద్ర మానస గంగా (మాచవరం) ఎడ్లు 2000 అడుగుల దూరాన్ని లాగి ఆ తర్వాతి వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

పాలపళ్ల విభాగంలో..

మోపర్తి ఆర్యాన్ చౌదరి (నార్నెపాడు, ముప్పాళ్ల మండలం) ఎడ్లు 3,500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కన్నెదార రామ్‌తేజా చౌదరి (పెదకూరపాడు) ఎడ్లు 3,250 అడుగులు, వెలిదిండి బాబు (ఇనిమెట్ల, రాజుపాలెం మండలం) 3,250 అడుగులు, మోదుగుల రామిరెడ్డి (పెదపరిమి, తుళ్లూరు మండలం) ఎడ్లు 3,202 అడుగులు, కుర్రి గంగరాజు (మోర్జంపాడు, మాచవరం మండలం) ఎడ్లు 2,750 అడుగులు, మద్యపు గోపిరెడ్డి (కిష్టాపురం, తెలంగా) ఎడ్లు 2,724.10 అడుగులు, బిక్కు వెంకటేశ్వర్లు (పెనుగంచిప్రోలు, ఎన్‌టీఆర్ జిల్లా) ఎడ్లు 2,652.2 అడుగుల దూరాన్ని లాగి తర్వాతి వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు దక్కించుకున్నాయి.